సాక్షి
యాదాద్రి భువనగిరి

సోమవారం ౹ 29 ౹ మే ౹ 2023



ఆర్టీసీ.. ఆదాయ'మస్తు'!

పెళ్లిళ్లు, శుభకార్యాలు, విద్యా సంస్థలకు సెలవులు ఉండడంతో జనం ఆర్టీసీ బస్సుల్లో ఎక్కువగా ప్రయాణించారు. - 8లో



అగ్రగామిగా తీర్చిదిద్దుతా

భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 9లో

గరిష్టం/కనిష్టం
42° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మెట్రో బస్సుల పునరుద్ధరణ



సాక్షి ఎఫెక్ట్..

సంస్థాన్ నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం, జనగాం మీదుగా నడుస్తున్న మెట్రో బస్సులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'బస్సులు రావు.. బాధలు తీరవు' అనే శీర్షికతో ఈ నెల 8న సాక్షిలో కథనం ప్రచురితమైంది. కథనం క్లిప్పింగ్‌ను మంత్రి కేటీఆర్, రవాణా శాఖమంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్‌కు సహస్ర వేదిక్ సేవా సమితి వ్యవస్థాపకుడు అరుణ్‌సాగర్ ట్విట్టర్ ద్వారా పంపించారు. అలాగే హయత్‌నగర్ డిపో–1,2 మనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు ఆర్టీసీ అధికారులు స్పందించి దిల్‌సుఖ్‌నగర్ నుంచి సంస్థాన్‌నారాయణపురం మీదుగా కొంపల్లి(మునుగోడు), దిల్‌సుఖ్‌నగర్ నుంచి సంస్థాన్‌నారాయణపురం, జనగాం మీదుగా గట్టుప్పల్ వరకు మెట్రో బస్సులను పునరుద్ధరించారు.

ప్రపంచ దేశాలకు మోదీ ఆదర్శం



బీజేపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న గూడూరు నారాయణరెడ్డి

బీబీనగర్ : దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు, చట్టాలను అమలు చేస్తూ ప్రపంచ దేశాలకే మోదీ ఆదర్శంగా నిలిచారని బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం బీబీనగర్ మండలంలోని రాయరావుపేటకు చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. యువత మొత్తం మోదీ వైపే చూస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గడ్డం కృష్ణ, బండారి రమేష్, రాజయ్య, మనోజ్, నరేష్ తదతరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జంగారెడ్డి, నాయకులు సాయి, వినోద్, వెంకటేష్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ డైరెక్టర్‌కు విశ్వకర్మ లెజండరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్.ఎన్.చారి

మోత్కూరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా డైరెక్టర్, చిత్రకారుడు ఎస్.ఎన్.చారికి విశ్వకర్మ నేషనల్ సమ్మిట్ లెజండరీ అవార్డు ప్రదానం చేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో నందికొండ జగద్గురు, కాళహస్తీశ్వర సంస్థానం గాయత్రి పీఠాధిపతి శ్రీశ్రీ కాతేంద్ర స్వామివారు, చెన్నై భువనేశ్వరి పీఠాధిపతి దేవదత్త శక్తి పొగ ఆచార్యులు, విజయవాడ ఎమ్మెల్యేలు వెన్నంపల్లి శ్రీనివాస రావు, మల్లాది విష్ణు, విజయవాడ జడ్జి దేవ్‌నర్సింహాచారి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విశ్వకర్మ కార్పొరేషన్ చైర్మన్ చొల్లేటి శ్రీకాంత్‌చారి, విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు విశ్వనాథుల పుష్పగిరి, వెంకట్ పాల్గొన్నారు.

ఉగ్ర భానుడు

భువనగిరిటౌన్ : భానుడు తన ఉగ్రరూపం ప్రదర్శిస్తూనే ఉన్నాడు. మూడు రోజులుగా ఎండలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఆదివారం అత్యధికంగా వలిగొండ మండలంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రామన్నపేట 42.4, బీబీనగర్ 42.1, అడ్డగూడూరు 41.9, చౌటుప్పల్ 41.7, ఆలేరు 41.5, మోత్కూర్ 40, భువనగిరి 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 7గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతోంది. సాయంత్రం 5 అయినా వేడి తగ్గడం లేదు. ఎండకు తోడు ఉక్కపోత, వడగాలి తోడవడంతో జనం అల్లాడిపోయారు. బస్సులు, రైళ్లలో ప్రయాణించే వాళ్లు ఉక్కపోతకు నీరసించిపోతున్న పరిస్థితి ఏర్పడుతుంది.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్య కైంకర్యాలుర శాస్త్రోక్తంగా జరిగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూ పంచనారసింహులకు బిందే తీర్థం, ఆరాధన, బాలభోగం నిర్వహించారు. అనంతరం నిజాభిషేకం, సహస్రనామార్చన గావించి తులసీ దళాలతో అర్చించారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు జరిపించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయ తిరువీధిలో భక్తులు

'వెదిరె' విగ్రహం ఏర్పాటు చేయాలి

భూదాన్‌పోచంపల్లి : ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరుతూ భూదాన్ రాంచంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆది వారం మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పోచంపల్లిలో వెదిరె రాంచంద్రారెడ్డి స్మారక భవనం నిర్మించాలని, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని, సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెదిరె రాంచంద్రారెడ్డి వారసులు, భూదాన్ రాంచంద్రారెడ్డి సేవాసమితి వ్యవస్థాపక గౌరవ సలహాదారులు వెదిరె ప్రబోద్‌చంద్రారెడ్డి, సాగర్‌చంద్రారెడ్డి, వెదిరె



మంత్రి జగదీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భూదాన్ రాంచంద్రారెడ్డి సేవా సమితి సభ్యులు

అరవిందారెడ్డి, వెదిరె సుభాష్‌చంద్రారెడ్డి, సేవా సమితి అధ్యక్షుడు పోతగల్ల దానయ్య, ఉపాధ్యక్షుడు కొమ్ము లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరగల్ల కుమార్, కోశాధికారి మోటె రాజు, చేరాల బుచ్చయ్య, సీత రాములు తదితరులు పాల్గొన్నారు.

'ముందుకు సాగు'దాం..



వెదజల్లే పద్ధతి బాగుంటుంది



కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

వరిలో నారు పెంచుకుని, నాట్లు వేసుకునే పద్ధతి కాకుండా దమ్ముచేసుకుని బురదలో విత్తనం వెదజల్లడం వల్ల సమయం కలిసివస్తుంది. డైరెక్ట్ సీడింగ్ పద్ధతి అంటారు. దీని వల్ల పంట సమయం కొంత ముందుకు జరుగుతుంది. ఏదైనా స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతపై ఆధారపడి ఉంటుంది. ఈ అంశాలను చూసుకుని రైతులు వరిసాగును కనీసం 15 నుంచి 20 రోజులైనా ముందుగా చేపట్టాలి.

- వరి సాగు కాలాన్ని ముందుకు జరుపుకోవాలి
- వానాకాలం, యాసంగి సీజన్లలో కూడా ఇదే పద్ధతి పాటించాలి
- ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడేందుకు ఇదే శరణ్యం
- స్వల్పకాలిక రకాలను ఎంచుకోవాలి
- స్థానిక పరిస్థితులు, నీటి లభ్యత చూసుకోవాలి
- కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

నల్లగొండ డెస్క్:

యాసంగి నాట్లు, కోతలు ఆలస్యమవడం వల్ల ప్రకృతి విపత్తులతో రైతులు పంటలను నష్టపోతున్నారు. దీన్ని నివారించేందుకు యాసంగితో పాటు వానాకాలం సాగు కాలాన్ని కూడా ముందుకు జరపాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీని వల్ల ఒనగూరే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కలెక్టర్ల సమావేశంలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా సూచించారు. శనివారం నల్లగొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా దీనిపై తీర్మానం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు పంటల సాగును ఏ విధంగా ముందుకు జరుపుకోవాలి, అందుకు ఏ రకం విత్తనాలను ఎంచుకోవాలి, ఏ రకమైన పద్ధతులు పాటించాలన్న అంశాలపై కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, శాస్త్రవేత్త శ్రీనివాసరావు 'సాక్షి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

వానాకాలం, యాసంగి సాగును ముందుకు జరుపుకోవాలని ప్రభుత్వం ఆదేశం మేరకు రైతులకు సూచిస్తున్నాం. వ్యవసాయ విశ్వవిద్యాలయం తరఫున కూడా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పంటకాలం ముందుకు జరుపుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల నుంచి కొంత వరకు బయటపడవచ్చని రైతులకు వివరిస్తున్నాం. ప్రస్తుతం వానాకాలం సీజన్‌ను కొన్నిచోట్ల రైతులు ప్రారంభించారు. వరి సాగు చేపట్టే రైతులు అందరూ పనులు మొదలుపెట్టాలి.

సాధారణంగా వానాకాలంలో వరినాట్లు ఆగస్టు నెల వరకు వేస్తుంటారు. ఈ పంట దిగుబడి వచ్చే సమయంలో అంటే.. నవంబర్, డిసెంబర్‌లో వచ్చే తుపాన్లకు పంట దెబ్బతిని రైతు నష్టపోతున్నాడు. ఇలా కాకుండా మే నెల చివరలో గానీ, జూన్ రెండో వారంలోగా నారు పోసుకుని జూలైలో నాట్లు పూర్తి చేసుకుంటే తుపాన్లు అధికంగా వచ్చే సమయానికి పంట చేతికి వస్తుంది. అక్టోబర్‌లో పంట కోతకు వస్తుంది. దీంతో కొంత మేర నష్టం నుంచి బయటపడవచ్చు. సాగర్ ప్రాజెక్టు నీటిని ఆగస్టులో విడుదల చేస్తుంటారు. నీటి విడుదలలోగా బోర్ల ద్వారా నారు పెంచుకోవాలి. చెరువులు, రిజర్వాయర్ల కింద జూలైలో నీటిని విడుదల చేస్తారు. నాట్లు వేసే సమయానికి దాదాపు అంతటా నీరందుతుంది. నాన్ ఆయకట్టులో బోర్ల కింద ఎక్కువగా వరి సాగు చేస్తారు. మే, జూన్‌లో బోర్లలో కొంత నీరు తక్కువ వచ్చినప్పటికీ జూలైలో వర్షాలతో నీరు సరిపోతుంది.

ఎరువుల యాజమాన్యం తప్పనిసరి

దీర్ఘకాలిక రకాలకు వేసుకునే ఎరువులను స్వల్పకాలిక రకాలకు వాడకూడదు. పంట ముందుగా సాగుచేసినప్పుడు రెగ్యులర్‌గా పంటను గమనిస్తూ ఉండాలి. ఎరువుల యాజమాన్యం తప్పక పాటించాలి. యూరియా శాతం ఎక్కువైతే తెగుళ్ల దాడి పెరిగే అవకాశం ఉంటుంది. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలి. నీటి యాజమాన్యం కూడా ముఖ్యం. వరిమడిలో నీరు నిండుగా పెట్టి యూరియా వేయవద్దు. నీరు చాలా తక్కువ ఉన్నప్పుడు అంటే.. బురద మాదిరిగా ఉన్నప్పుడే వేయాలి.

SAKSHI INTERVIEW

యాసంగిలో అయితే..

యాసంగి పంటకు అక్టోబర్ చివరి వారం నుంచి వరి నార్లు పోసుకోవాలి. డిసెంబర్ మొదటి వారంలోగా నాట్లు పూర్తి చేసుకోవాలి. ఇలా అయితే మార్చి చివరి నాటికి కోతలు పూర్తవుతాయి కాబట్టి ఏప్రిల్‌లో వచ్చే అకాల వర్షాల నుంచి రైతులు తప్పించుకోవచ్చు. ప్రతి సంవత్సరం ప్రత్యేకించి కొన్ని మండలాల్లో అకాల వర్షాల వల్ల నష్టం జరుగుతోంది. ఆయా మండలాల రైతులు పంటను ముందుగా వేసుకోవాలి. 120, 130 రోజుల్లో దిగుబడి వచ్చే సీడ్‌ను ఎంచుకోవాలి. యాసంగి సీజన్‌లో నార్లు నవంబర్‌లో పోసుకుంటే చలికి కొన్ని సమస్యలు వస్తాయి. దాని నుంచి రక్షణ చర్యలు చేపట్టాలి. చలికి తట్టుకునే విత్తన రకాలను ఎంచుకోవాలి. నారుమళ్లపై పట్టాలు కప్పుకోవాలి. నారుమడి దమ్ము చేసినప్పుడు కోళ్ల ఎరువు, పశువుల ఎరువు వేసుకోవాలి. పొటాష్ సాధారణం కంటే కొద్దిగా ఎక్కువ వేయాలి. రైస్ మిల్లులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో పచ్చి ధాన్యం కొంటారు కాబట్టి ఆ ప్రాంతాల్లో రైతులకు పెద్దగా ఇబ్బంది ఉండడం లేదు. వారు అనుకూలమైన సమయంలో ఎప్పుడైనా నాట్లు వేసుకునే అవకాశం ఉంటుంది.

స్వల్పకాలిక వరి విత్తనాలు ఇవే..

» **ఆర్‌ఎన్‌ఆర్–29325 (రాజేంద్రనగర్ వరి–5)**

120 నుంచి 125 రోజులు పంట కాలం కలిగిన స్వల్ప కాలిక రకం. పొడవు, దొడ్డు గింజ రకం. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడునిస్తుంది.

» **తెలంగాణ సోన(ఆర్‌ఎస్‌ఆర్–15048)**

125 రోజుల పంట కాలం కలిగిన స్వల్ప కాలిక రకం. జూలై మొదటి వారం తరువాత నారు పోసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. తక్కువ నూక శాతంతో బియ్యం నాణ్యతగా ఉంటాయి. హెక్టారుకు 60 నుంచి 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

» **కేఎన్‌ఎమ్–1638(కూనారం రవి–1)**

125 నుంచి 130 రోజులు పంట కాలం కలిగిన స్వల్పకాలిక రకం. ఉల్లికోడు, అగ్గి తెగులును తట్టుకుంటుంది. వానాకాలం ఆలస్యంగా విత్తుకోవడానికి అనుకూలమైన వరి రకం. బియ్యం రుచితో కూడిన నాణ్యత కలిగి ఉంటాయి. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

» **కేఎన్‌ఎమ్–118(కూనారం సన్నాలు)**

125 రోజులు పంట కాలం కలిగిన స్వల్ప కాలిక దొడ్డు రకం. ఇది ఎమ్‌టీయూ 1010 రకాన్ని పోలి ఉంటుంది. పంటపై గింజ రాలే శాతం తక్కువ ఉంటుంది. గింజ బరువు ఎక్కువగా ఉంటుంది. హెక్టారుకు 70 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

» **జేజీఎల్–24423(జగిత్యాల రైస్–1)**

125 రోజుల పంట కాలం కలిగిన స్వల్పకాలిక వరి రకం. ఇది ఎమ్‌టీయూ 1010 రకానికి ప్రత్యామ్నాయ రకం. గింజ రాలే గుణం తక్కువ. హెక్టారుకు 70 నుంచి 82 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

» **జేజీఎల్–27356(జగిత్యాల వరి–3)**

130 నుంచి 135 రోజులు పంట కాలం కలిగిన మధ్యకాలిక అతి సన్న గింజ వరి రకం. బియ్యం నాణ్యత కలిగి ఉంటాయి. హెక్టారుకు 70 నుంచి 75 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

» **వానాకాలం, యాసంగి సీజన్లలోనూ వేసుకోవచ్చు**

క్యూలైన్ల మధ్య గ్రిల్స్.. ఇబ్బందుల్లో భక్తులు



ధర్మదర్శనం క్యూలైన్ మధ్య ఏర్పాటు చేసిన అల్యూమినియం గ్రిల్స్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయ ధర్మదర్శనం క్యూలైన్ల మధ్య గ్రిల్స్ ఏర్పాటు చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ గ్రిల్స్ భక్తులకు ఇబ్బందికరంగా మారాయి. ఇప్పటికే క్యూలైన్లు ఇరుకుగా ఉండడం.. గ్రిల్స్ ఏర్పాటుతో సాఫీగా ముందుకెళ్లలేని పరిస్థితి ఉంది. అత్యవసర సమయంలో భక్తులు బయటికి వెళ్లాలంటే గ్రిల్స్ అడ్డంకిగా మారాయని భక్తులు అంటున్నారు. అధికారులు మాత్రం దర్శనాలు సాఫీగా జరగాలన్న ఉద్దేశంతో గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు కోచ్‌ల ఎంపిక

నల్లగొండ టూటౌన్: ఈనెల 31వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరుగనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కోచ్‌లుగా మద్ది కరుణాకర్, బొడ్డుపల్లి సునీత ఎంపికైనట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు పురుషులు, మహిళల జట్లకు కోచ్‌లుగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కరుణాకర్ అవుట్‌డోర్ స్టేడియంలో ఫుట్‌బాల్ జట్లకు కోచ్‌గా, సునీత నల్లగొండ మండలం అప్పాజీపేట బీసీ గురుకుల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కబడ్డీ జట్టు కోచ్‌గా వేణు

మిర్యాలగూడ: సీఎం కప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా జట్టుకు కోచ్‌గా దామరచర్లకు చెందిన గాలం వేణు ఎంపికయ్యారని ఛత్రపతి శివాజీ కబడ్డీ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు తెలిపారు. వేణు ఎంపిక పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

అనుకూలమా.. ప్రతికూలమా!

అందరిలో సర్వే గుబులు!

- ఇప్పటికే అధికార పార్టీ పలుమార్లు సర్వేలు
- సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో టెన్షన్
- అదే బాటలో కాంగ్రెస్.. పైరవీలకు తావులేదని స్పష్టం



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికలపై అన్ని రాజకీయ పార్టీలు ఫోకస్ పెట్టాయి. మూడోసారి అధికారంలోకి రావాలని బీఆర్‌ఎస్.. ఈసారి ఎలాగైనా విజయం సాధించాలన్న పట్టుదలతో కాంగ్రెస్, బీజేపీలు ఉన్నాయి. అయితే గతంలో మాదిరిగా పైరవీలకు తావులేకుండా సర్వే రిపోర్ట్ ఆధారంగానే టికెట్ ఇవ్వనున్నట్లు పలు రాజకీయ పార్టీలు ప్రకటించిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ ఇప్పటికే ఇప్పటికే పలు దఫాలు సర్వేలు చేయించగా.. కాంగ్రెస్ సైతం సర్వే ఆధారంగానే టికెట్‌లు ఇస్తామని ఇటీవల ప్రకటించడంతో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, ఆశావహుల్లో గుబులు నెలకొంది.

పనితీరు మెరుగుపరుచుకునే యత్నం

ఆలేరు, భువనగిరి, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. అధికార పార్టీ పలుసార్లు నిర్వహించిన సర్వేల్లో ప్రజలు ఏం చెప్పారోనన్న భయం వారిని వెంటాడుతోంది. నిఘా వర్గాలు, అధికార పార్టీ అనుబంధ పత్రిక, ఓ ప్రైవేట్ సంస్థ ఇటీవల సర్వే చేపట్టాయి. సర్వే తమకు అనుకూలంగా ఉందా.. ప్రతికూలంగా ఉందా ఎమ్మెల్యేలు తెలుసుకుంటున్నారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఎమ్మెల్యేలు తమ తప్పులు దిద్దుకోవడం, పనితీరును మరింత మెరుగుపర్చుకునే యత్నంలో ఉన్నారు.

సీఎంను కలిసిన గొంగిడి దంపతులు

ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ చైర్మన్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి దంపతులు నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలువడం చర్చనీయాంశమైంది. సర్వే నివేదిక ఆధారంగా ఈసారి సునీతకు బదులు ఆమె భర్త మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా కేసీఆర్ బరిలోకి దించే అవకాశం ఉందన్న ప్రచారం పలు మీడియాల్లో జరుగుతోంది. సిట్టింగ్‌లకే సీట్లు అంటూనే కొందరికి మార్పు ఖాయమని కేసీఆర్ ప్రకటించిన వెంటనే ఈ ప్రచారం మొదలైంది. కేడర్‌లోనూ వివిధ రకాలుగా చర్చ మొదలైంది. టికెట్ తమకే ఖాయమని పార్టీ శ్రేణులకు సంకేతాలివ్వడానికే సీఎంను కలిసి హామీ తీసుకున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి కూడా గో హెడ్ అని మహేందర్‌రెడ్డి భుజంతట్టారని గొంగిడి సునీత ప్రకటించడంతో బీఆర్‌ఎస్ వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. మరోసారి ఆలేరు నుంచి పోటీచేయడం ఖాయమన్న ధీమాతో ఉన్నాయి.

కాంగ్రెస్‌లోనూ సర్వే..

పైరవీకారులకు కాదు సర్వేల ఆధారంగా టికెట్ కేటాయిస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే. సర్వే ప్రామాణికంగా నియోజకవర్గాల్లో నిత్యం ప్రజల మధ్య ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో టికెట్ ఆశిస్తున్న ఆశావహులు నిత్యం ప్రజల మధ్య ఉండే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారు.

చిక్కిన పట్టు పోకుండా..

జిల్లాలో బీజేపీ చాపకింది నీరులా విస్తరిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ చేపట్టిన ప్రజాసంగ్రామ యాత్ర జోష్ నింపింది. దాంతో పాటు స్ట్రీట్ కార్నర్ సమావేశాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలకు మరింత చేరువయ్యారు. గతంలో కంటే తమ బలం పెరగడంతో చిక్కిన పట్టును వదులుకోవద్దన్న పట్టుదలతో నాయకత్వం ఉంది. వచ్చే ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కార్యక్రమాలను విస్తృత పరుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తోంది. టికెట్ ఆశిస్తున్న వారు తమ ప్రచారాన్ని ప్రారంభించారు.

గిరిజన బిడ్డ.. హాకీలో మెరిక

- చదువుకుంటూనే హాకీలో సత్తా చాటుతున్న లప్పానాయక్‌తండా విద్యార్థి
- చిన్న వయస్సులోనే రెండు టోర్నమెంట్లలో అత్యుత్తమ ప్రదర్శన
- ఇండియా సబ్ జూనియర్స్ మెన్స్ చాంపియన్ షిప్‌కు ఎంపిక
- ఆదర్శంగా నిలుస్తున్న శంకర్



హాకీ ప్రాక్టీస్ చేస్తున్న శంకర్

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు చెందిన ధీరావత్ శంకర్ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నాడు. హాకీలో ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ధీరావత్ గణేష్ – వీరమణి దంపతులకు ఇద్దరు కుమారులు. చిన్నకుమారుడు శంకర్ ఇటీవల పదవ తరగతి పూర్తి చేశాడు. తండ్రి ఉల్లిగడ్డల వ్యాపారం చేస్తుండగా తల్లి కూలికి వెళ్తుంది. నిరుపేద కుటుంబానికి చెందిన శంకర్ 5వ తరగతి నుంచే హాకీపై మక్కువ పెంచుకున్నాడు. తండాలో ఎలాంటి సౌకర్యాలు లేనప్పటికీ స్వతహాగా ఇంటి వద్దనే ప్రాక్టీస్ చేశాడు. తండాకు చెందిన యువకుడు నవీన్ నాయక్ సలహాలు, సూచనలు, నల్లగొండకు చెందిన హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం సహకారంతో హాకీపై పట్టు సాధించాడు.

తొలి టోర్నీలోనే అత్యుత్తమ ప్రదర్శన

శంకర్ తొలుత ఎస్‌ఎన్‌డీపీ టోర్నమెంట్‌లో పాల్గొని సత్తా చాటారు. అనంతరం ఈ ఏడాది మార్చిలో రంగారెడ్డి జిల్లాలో జరిగిన జూనియర్స్ హాకీ టోర్నమెంట్‌లో జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించాడు. 6 గోల్స్ సాధించి కోచ్‌తో పాటు సెలక్టర్ల దృష్టి ఆకర్షించాడు. 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్స్ మెన్స్ నేషనల్ చాంపియన్ షిప్ – 2023కు తెలంగాణ రాష్ట్రం తరఫున ఎంపికయ్యాడు. రాష్ట్రం తరఫున ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి నలుగురు ఎంపికవగా అందులో శంకర్ ఒకరు. ఒడిశాలో బిహార్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగాడు.

జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి

హాకీ ఇండియా సబ్ జూనియర్స్ మెన్స్ నేషనల్ చాంపియన్ షిప్‌కు ఎంపికవవడం సంతోషంగా ఉంది. సహకరించిన నల్లగొండ హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం, నవీన్ అన్నకు కృతజ్ఞతలు. మున్ముందు జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరు తెస్తాను.


– ధీరావత్ శంకర్, లప్పానాయక్‌తండా

చిన్న వయస్సులోనే ఉత్తమ ప్రదర్శన



ధీరావత్ శంకర్‌కు హాకీపై ఉన్న మక్కువను గమనించి ప్రాక్టీస్ చేయించాను. మొదటగా ప్రైవేట్ టోర్నీలో ప్రతిభ కనబరిచాడు. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లాలో జరిగిన పోటీలకు ఎంపికయ్యాడు. ఇందులో 6గోల్స్ చేసి ఇండియా సబ్ జూనియర్స్ మెన్స్ నేషనల్ చాంపియన్ షిప్‌కు ఎంపికయ్యాడు.

–నవీన్‌కుమార్, లప్పానాయక్‌తండా



ఇండియా సబ్ జూనియర్స్ మెన్స్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన తెలంగాణ జట్టుతో శంకర్ (వృత్తంలో)

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు


గాయపడిన మోదాల భూపాలు

శాలిగౌరారం : రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని చౌళ్ల గూడెం వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట మండలం సోలిపేట గ్రామానికి చెందిన మోదాల భూపాలు(45) అతని భార్య సైదమ్మ(40)లు కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి శాలిగౌరారం మండలం వల్లాలకు 365వ నంబర్ జాతీయ రహదారి గూండా వెళ్తున్నారు. ఈ క్రమంలో మాదారంకలాన్ గ్రామపంచాయతీ పరిధిలోని చౌళ్లగూడెం వద్దకు రాగానే వరంగల్ జిల్లా ఖిల్లావనపర్తి నుంచి మిర్యాలగూడ ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ వెనకవైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న మోదాల భూపాలు అతని భార్య సైదమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారిని 108 వాహనంలో నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సైదమ్మ తమ్ముడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సూర్యాపేట నియోజకవర్గ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ మతతత్వం పేరుతో ప్రజల్లో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. కాగా.. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర పరిస్థితులు అనే అంశంపై బోధించారు. శిక్షణ తరగతులకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్గూరి గోవింద్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. శిక్షణ తరగతుల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు మేఘన బోయిన శేఖర్, ధనియాకుల శ్రీకాంత్, వీర బోయిన రవి, చినపంగి నర్సయ్య, కొప్పుల రజిత, సైదమ్మ, బచ్చలకూర రామ్‌చరణ్, మడ్డి అంజిబాబు, రాంబాబు, మందడి రాంరెడ్డి, మేకల అంజయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.

31న బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవం

నేరేడుచర్ల : హైదరాబాద్‌లో ఈనెల 31వ తేదీన జరిగే బ్రాహ్మణ సదన్ ప్రారంభోత్సవానికి బ్రహ్మణ అర్చకులు భారీగా తరలిరావాలని తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నంబొట్ల ఫణికుమారశర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా గోపనపల్లిలో 10 ఎకరాల్లో రూ.12 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బ్రాహ్మణ సదన్ భవన ప్రారంభోత్సవం సీఎం చేతుల మీదుగా ఉదయం 10గంటలకు ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దూప దీప నైవేద్య పథకం ద్వారా అర్చకులకు గౌరవ వేతనం అందిస్తున్న ఘనత సీఎందేనని అన్నారు. ఈ భవన ప్రారంభోత్సవంలో భాగంగా సుదర్శన యాగం, పూర్ణహుతి, చండీ హోమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ.. ఆదాయ'మస్తు'!

- విద్యార్థులకు సెలవులు, శుభకార్యాల సీజన్ కావడంతో పెరిగిన ప్రయాణికుల తాకిడి
- లాభాల బాటలో రీజియన్ పరిధిలోని డిపోలు
- గడిచిన రెండు నెలలతో పోలిస్తే పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- రీజియన్‌లో ప్రతిరోజు 76శాతానికి పైగా ఓఆర్ నమోదు



మిర్యాలగూడ టౌన్ : శ్రీరస్తు..శుభమస్తు.. కల్యాణమస్తు.. అంటూ పెద్దలు వధూవరులను దీవిస్తుండగా.. ప్రయాణికులు ఆదాయ'మస్తు' అంటూ ఆర్టీసీని ఆదరిస్తున్నారు. పెళ్లిళ్లు, శుభకార్యాలతో బంధుగణం ఆర్టీసీకి అదనపు ఆదాయాన్ని సమకూర్చిపెడుతోంది. విద్యార్థులకు వేసవి సెలవులు, శుభ ముహూర్తాల నేపథ్యంలో ప్రయాణ ప్రాంగణాలు రద్దీగా మారుతున్నాయి. దీంతో నల్లగొండ రీజియన్ పరిధిలోని డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయి.

ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ

తాజా, పరిస్థితుల్లో ఆర్టీసీ ఆదాయం కోసం కొట్టుమిట్టాడుతోంది. ఈ క్రమంలో సంస్థ రాబడి మార్గాలను అన్వేషిస్తోంది. ఇప్పటికే ప్రయాణికులతో ఏ విధంగా మర్యాదగా మెలగాలి ఆదాయం ఎలా పెంచుకోవాలి.. అనేదానిపై కండక్టర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. అదే విధంగా పెళ్లిళ్లకు బస్సులను అద్దెకు ఇవ్వడం, ప్రయాణికుల చేయి ఎత్తిన చోట బస్సులు ఆపడం, సిబ్బంది ఆరోగ్య చర్యలను తీసుకోవడం, ప్రయాణాల పరమైన రాయితీలు ఇవ్వడం చేస్తోంది. అవన్నీ క్రమంగా ఆర్టీసీ రాబడి వైపు నడిపిస్తుండగా దీనికి విద్యార్థులకు వేసవి సెలవులు, వివాహాల సీజను మంచిగా కలిసి వచ్చింది. దీంతో ఇప్పటి వరకు అన్ని డిపోలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి.

గణనీయంగా పెరుగుతున్న రాబడి

ప్రస్తుతం నల్లగొండ రీజియన్ పరిధిలో శనివారం 2.63లక్షల కిలో మీటర్లు తిరిగి రూ.1.17కోట్ల ఆదాయంతో డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయి. వివాహముహూర్తాల కారణంగా డిపోలకు రోజువారీ సగటు ఆదాయం పెరుగుతోంది.

ఓఆర్ నమోదు ఇలా..

ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియా(ఓఆర్) ఎంత శాతం నమోదు అవుతుందనేది ఎంతో ముఖ్యం. శుభముహూర్తాలు కారణంగా ప్రతి రోజు నల్లగొండ రీజియన్ పరిధిలో 76శాతానికి పైగా ఓఆర్ నమోదు అవుతోంది. గత మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ వరకు తక్కువగా ఉన్న ఓఆర్ మే మొదటి వారం నుంచి గణనీయంగా పెరిగింది. పెళ్లి ముహూర్తాలు జూన్ మొదటి వారం వరకు ఉండటంతో ఓఆర్ పెరగడంతో పాటు సంస్థకు మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

ఆదాయం వచ్చే మార్గాలు ఇవే

అవకాశం ఉన్నప్పుడు ఆదాయం సాధించాలనే చందంగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో పెళ్లిళ్ల సీజను కావడంతో రద్దీలేని, లాభాలు లేని రూట్లలో బస్సులను నడిపించడం లేదు. ప్రయాణికులు అధికంగా ప్రయాణించే రూట్లల్లోనే బస్సులను నడిపిస్తున్నారు. దీంతో ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు.

నల్లగొండ రీజియన్ పరిధిలో 27న డిపోల వారీగా వచ్చిన ఆదాయం ఇలా..

డిపోలు	కిలోమీటర్లు	ఆదాయం(రూ.లక్షల్లో)	ఓఆర్
దేవరకొండ	45,398	20,60,586	77
నల్లగొండ	52732	22,70,467	74
నార్కట్‌పల్లి	5445	2,43,615	76
మిర్యాలగూడ	44,129	20,95,554	75
యాదగిరిగుట్ట	36546	19,65,311	101
కోదాడ	32819	14,67,730	75
సూర్యాపేట	45344	18,29,992	66

ఆదాయం మరింత పెరిగింది



"పెళ్లిళ్ల సీజను, విద్యార్థులకు వేసవి సెలవులుకావడంతో చాలా వరకు ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. దీంతో రీజినల్ పరిధిలోని డిపోలలో రోజువారీ సగటు ఆదాయం పెరిగింది. ఆక్యుపెన్సీ రేషియోను తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నాం. అదే విధంగా ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువ శాతం బస్సులు రద్దీగా ఉంటున్నాయి. ఉద్యోగ, సిబ్బందిని కూడా అప్రమత్తం చేశాం. చేతులు ఎత్తిన వద్ద బస్సు తప్పకుండా ఆగుతుందన్నారు. ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తీసేకెళ్లడమే ఆర్టీసీ సంస్థ లక్ష్యం.

– సంబరాజు శ్రీదేవి ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్లగొండ

నలభై నిమిషాల్లో ఏం జరిగింది..?

వీడని యువతి మృతి మిస్టరీ

- శోభ కాల్‌డేటా సేకరణలో పోలీసులు
- అపార్ట్‌మెంట్‌లోకి వెళుతున్న సీసీ ఫుటేజీ స్వాధీనం
- కూతురు మృతిపై అనుమానాలున్నాయని తల్లిదండ్రుల ఫిర్యాదు


దండగల శోభ(ఫైల్) రోదిస్తున్న మృతురాలి తల్లి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి వెలుగులోకి వచ్చిన యువతి అనుమానాస్పద మృతి మిస్టరీ వీడలేదు. పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన దండగల వెంకన్న అలివేలు దంపతుల కుమార్తె దండగల శోభ(18) డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేసిన శోభ పరీక్షలు ఉండటంతో ఇంటి వద్దనే ఉండి చదువుకుంటోంది. ఈ క్రమంలో ఏమైందో ఏమో గాని శనివారం రాత్రి 7:40 గంటల సమయంలో బైపాస్‌రోడ్డు వెంట ఉన్న వైష్ణవి అపార్ట్‌మెంట్ వద్దకు ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లింది. ఈ దృశ్యం బైపాస్‌రోడ్డు వెంట ఉన్న ఖలీల్ దాబా ఎదురుగా ఉన్న సీసీ కెమరాల్లో రికార్డు కాగా ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైష్ణవి అపార్ట్‌మెంట్‌లోని రెండవ అంతస్తు వరకు శోభ చేరుకున్నట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.

కూపీ లాగుతున్న పోలీసులు

కాగా, వైష్ణవి అపార్ట్‌మెంట్‌లోకి శనివారం రాత్రి 7.40 గంటలకు చేరుకున్న శోభ మరో 40నిమిషాల అనంతరం రెండో అంతస్తు నుంచి కిందపడింది. అయితే, అపార్ట్‌మెంట్‌కు శోభ ఎందుకు వెళ్లింది? ఎవరితో మాట్లాడింది.? 40నిమిషాల్లో ఏం జరిగింది. అనే అంశాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. కాగా, శోభ తన సెల్‌ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్లింది. ఘటన తర్వాత పోలీసులు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఐదు నెలల కాల్‌డేటా సేకరించే పనిలో ఉన్నారు. కాగా, కూతురు మృతిపై అనుమానాలున్నాయని శోభ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపార్ట్‌మెంట్‌లో తమకు తెలిసిన వారు ఎవరూ లేరని పేర్కొన్నారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం శోభ మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా అంత్యక్రియలు పూర్తిచేశారు. శోభ మృతి విషయం తెలుసుకున్న వారి బంధువులు ఆస్పత్రి వద్దకు చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

సీఎం కప్ బాక్సింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపిక


ముదిగొండ ముఖేష్

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామానికి చెందిన ముదిగొండ ముఖేశ్ సీఎం కప్–2023 క్రీడా పోటీల్లో బాక్సింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన ముఖేష్ సీఎం కప్ మండల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాడు. ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. తన విజయానికి తోడ్పాటునందించిన కోచ్ రవీందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. దాతలు సహకరిస్తే భవిష్యత్తులో జాతీయ స్థాయిలో బాక్సింగ్ పోటీల్లో పాల్గొని దేశానికి పేరు తేవడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- మరో ఆరుగురికి తీవ్ర గాయాలు
- చివ్వెంల మండల పరిధిలో ఘటనలు


అలీ, సాయికృష్ణ మృతదేహాలు

చివ్వెంల(సూర్యాపేట) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందగా మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చివ్వెంల మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూర్(ఎస్) మండలం దాచారం గ్రామ సర్పంచ్ సయ్యద్ మహ్మద్ అలీ (50) సొంత పనుల నిమిత్తం బైక్‌పై గ్రామానికి చెందిన గూడెపురి అర్వపల్లిని ఎక్కించుకుని సూర్యాపేటకు బయలుదేరాడు. మార్గమధ్యలో బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దీంతో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మణ్‌నాయక్ తండా గ్రామ శివారులోని బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని రోడ్డు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి నూతన్‌కల్ మండలం మిర్యాల గ్రామానికి బైక్‌పై వెళ్తున్న మిర్యాలగూడ మండలం బోట్యాతండాకు చెందిన భుక్యా ఆకాష్, భానోతు తరుణ్, పెన్‌పహాడ్ మండలం భక్తళాపురం గ్రామానికి చెందిన ధరావతు వీరన్న బైక్‌పై వేగంగా వచ్చి సర్పంచ్ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. సయ్యద్ మహ్మద్ అలీ పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు.

కల్వర్టును కారు ఢీకొట్టడంతో..

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా నందివాడ గ్రామానికి చెందిన గంపల సాయి కృష్ణ (26), గంపల కార్తీక్ కుమార్, కొల్లారెడ్డి రామానందరెడ్డి తమ మిషనరీలను మరమ్మతు చేయించేందుకు కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మండల పరిధిలోని జి.తిర్మలగిరి డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న గంపల సాయికృష్ణకు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కారుడ్రైవింగ్ చేస్తున్న కార్తీక్, వెనుక సీటులో కూర్చున్న రామానందరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.మృతుడి తండ్రి మహేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదాలకు అతివేగమే కారణమని తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


యాదగిరి (ఫైల్)

రాజాపేట : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని పాముకుంట గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం దౌవలపూర్ గ్రామానికి చెందిన ముక్కెర యాదగిరి (35) కుటుంబ సభ్యులతో కలిసి ఎనిమిది నెలలుగా పాముకుంట పరిధిలోని ఓ పౌల్ట్రీఫామ్‌లో పనిచేస్తున్నాడు. కాగా, ఆదివారం మధ్యాహ్నం పౌల్ట్రీఫామ్ పైన చల్లదనం కోసం గడ్డిపరుస్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగ యాదగిరికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం మేరకు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, 2017 డిసెంబర్ 22న సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం మునిగడపకు చెందిన ఒకే కుటుంబానికి చెంది ఏడుగురు కూలీలు విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి బలవన్మరణం


ఉమేష్(ఫైల్)

కేతేపల్లి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొర్లపహాడ్ గ్రామానికి చెందిన కొప్పుల ఉమేష్(29)కు కట్టంగూర్ మండల జాలుబాయిగూడెం గ్రామానికి చెందిన భవానితో ఏడేళ్ల కిత్రం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల లోపు కూతురు, కుమారుడు ఉన్నారు. ఉమేష్ తనకున్న భూమిలో వ్యవసాయం చేయడంతో పాటు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఉమేష్ కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ఈక్రమంలో శనివారం రాత్రి ఉమేష్ భార్య భవానితో గొడవపడ్డాడు. ఇంట్లో అందరూ నిద్రించిన తర్వాత ఉమేష్ ఆటో నడుపుకుంటూ బయటికి వెళ్లిపోయాడు.ఆదివారం తెల్లవారుజామున ఉమేష్ ఇంట్లో కనిపించక పోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతకసాగారు. ఈ క్రమంలో వ్యవసాయ బావి వద్ద చింతచెట్టుకు ఉరివేసుకుని వేళాడుతూ కనిపించాడు. కిందకు దింపి చూసేసరికి అప్పటికే ఉమేష్ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

సంస్థాన్ నారాయణపురం: మద్యం మత్తులో ఓ యువకుడు కిరాణ దుకాణం యజమాని సోదరుడిపై దాడి చేశాడు. ఈ ఘటన సంస్థాన్ నారాయణపురంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన నూకం గాలయ్య కిరాణ దుకాణానికి స్థానిక యువకులు పెద్దగోని అరవింద్, అభిరామ్, గోసుకొండ కార్తీక్, లోకేష్, విశ్వతేజ, షరీఫ్ శనివారం రాత్రి వెళ్లారు. ఈ క్రమంలో షాపు నిర్వాహకుడు గాలయ్యకు యువకులకు మధ్య గొడవ జరిగింది. దీంతో గాలయ్య సోదరుడు కృష్ణ జోక్యం చేసుకొని యువకులను అక్కడి నుంచి పంపించేశాడు. ఇది మనసులో పెట్టుకున్న పెద్దగోని అరవింద్ కూరగాయల కోసే కత్తితో తిరిగి వచ్చి కృష్ణపై దాడిచేశాడు. దీంతో కృష్ణకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని అసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిని బలిగొన్న ఈత సరదా


షేక్ సాజిద్ (ఫైల్)

మేళ్లచెరువు : ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలను బలితీసుకుంది. ఈ విషాదకర ఘటన మండలంలోని కందిబండలో చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన షేక్ సాజిద్ (19) ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తయ్యింది. కాగా, సాజిద్ ఆదివారం ఇంటర్ క్లాస్‌మేట్ ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి స్నేహితులతో కలిసి కందిబండకు వచ్చాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం ముగ్గురు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు ఈతకు వెళ్లారు. బావిలో ఈత కొడుతున్న సమయంలో సాజిద్ ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు .దీంతో మిత్రులు రేవూరులోని అతని తల్లిదండ్రులు ,పోలీసులకు సమాచారం అందించారు. బావిలోతుతో పాటు నీరు ఎక్కువగా ఉండడంతో హుజూర్‌నగర్ నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మూడు మోటార్లతో బావిలోని నీటిని తోడి మృతదేహాన్ని వెలికి తీశారు. కాగా, సాజిద్ తండ్రి షేక్ మహిరున్‌కు మొదటి సంతానం కాగా మరో తమ్ముడు, చెల్లి ఉన్నారు.

మిర్యాలగూడలో కారు బీభత్సం

- అతివేగంతో ఓ కారు, బైక్, సైకిల్‌ను ఢీకొట్టిన వాహనం
- మహిళకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- వాహనాన్ని వదిలేసి పరారైన యువకులు
- ఢీకొట్టిన కారులో ఖాళీ బీరు సీసాలు


బీభత్సం సృష్టించిన కారు వద్ద గుమిగూడిన జనం


ఢీకొట్టింది ఈ కారునే గాయపడిన రాజేశ్వరి

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డులో ఆదివారం ఓ కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ఓ కారుతో పాటు బైక్‌ను ఢీకొట్టుకుంటూ వెళ్లి సైకిల్‌పై వెళ్తున్న మహిళను సైతం ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిడమనూరు మండలం నారమ్మగూడేనికి చెందిన చక్రధరరాజు తన కుటుంబ సభ్యులతో కలసిషాపింగ్‌కు పట్టణానికి వచ్చాడు. కారును రోడ్డు పక్కన పార్కింగ్ చేసి దుకాణంలోకి వెళ్లారు. తిరిగి వచ్చి కారు ఎక్కే సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి రాజీవ్‌చౌక్ వైపు వేగంగా వెళ్తున్న తెల్లని కారు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకొచ్చింది. చక్రధర్‌రాజుకు చెందిన కారుతో పాటు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో రోడ్డు పక్కన నిలిపిన కారు దుకాణంలోకి దూసుకెళ్లింది. అదే సమయంలో సైకిల్‌పై వస్తున్న కుడిమిట్ల రాజేశ్వరిని సైతం కారు ఢీకొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా అతివేగంగా వచ్చి ఢీ కొట్టిన తెల్లని కారులో నలుగురు యువకులు ప్రయాణిస్తుండగా అందులోఓ ఖాళీ బీరు బాటిళ్లు లభ్యమయ్యాయి. మద్యం మత్తులో కారును అతివేగంగా నడిపినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటన జరిగిన తరువాత సదరు యువకులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. అయితే, కారులో ఉన్న నలుగురిలో ఇద్దరికి కూడా స్వల్ప గాయాలు అయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అద్దంకి రోడ్డుపై మరో కారు బోల్తా..

పట్టణంలోని అద్దంకి నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డుపై చింతపల్లి చౌరస్తా వద్ద ఆదివారం మధ్యాహ్నం కారు అదుపు తప్పి బోల్తా కొట్టింది. హైదరాబాద్ నుంచి గుంటూరు వైపునకు వెళ్తున్న కారుకు ఈ ప్రమాదం చోటు చేసుకుంది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలం రామాపురం గ్రామంలోని మిరియానంద విద్యానికేతన్ 1997–1998 సంవత్సరానికి చెందిన 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఉత్సవ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఒక్కొక్కరు ఏఏ హోదాల్లో స్థిరపడ్డారు. కుటుంబ నేపథ్యంతో పాటు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సిల్వర్ జూబ్లీ వేడుకల్లో కలుసుకోవడం పట్ల పూర్వ విద్యార్థులు ఆనందోత్సవాల్లో మునిగితేలారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ ధన్ రాజ్, ఉపాధ్యాయులు అనంతరెడ్డి, ఆనందరెడ్డి, నాగిరెడ్డి, ప్రసాద్, నజీరుద్దీన్, శివరామకృష్ణ, ప్రసాద్‌లతో పాటు పూర్వ విద్యార్థులు కోదాటి లక్ష్మణ్, రజనీకాంత్, వెంకన్న, విజయ్, ప్రభాకర్, దయాకర్, సోమగాని క్రాంతికుమార్, రాంబాబు, వేణు, శ్రీనివాస్, జ్యోతిరావు, క్రాంతికుమార్, రమేష్, శ్యాంబాబు, చంద్రశేఖర్ ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

డిండి: అనుమతులు లేకుండా అక్రయంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ.సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామం నుంచి నాగర్‌కర్నూల్ జిల్లా చారగొండ మండల కేంద్రం వైపు వెళ్లే రోడ్డు మార్గాన ప్యాసింజర్ ఆటోలో సుమారు 4.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. అప్పటి వరకే సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడి చేసి పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇందుకు కారణమైన పాటి, వెంకటేష్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నాడని..

- తండ్రి మందలించాడని కుమారుడు అదృశ్యం.. ఆపై బలవన్మరణం
- మూడు రోజులకు వెలుగుచూసిన మృతదేహం


సాయితేజ (ఫైల్)

రఘునాథపల్లి,యాదగిరిగుట్ట రూరల్: ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దని తండ్రి మందలించడంతో ఓ డిగ్రీ విద్యార్థి మనస్తాపానికి గురై ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో ఆదివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా ఆలేరు మండలం చిన్నకందుకూర్ గ్రామానికి చెందిన నమిలె పాండు కుమారుడు సాయితేజ (21)భువనగిరిలోని ఓ కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. సాయితేజ కొన్నాళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌లతో అప్పుల్లో కూరుకుపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి ఈనెల 25న ఆన్‌లైన్ గేమ్ ఎందుకు ఆడుతున్నావని కుమారుడిని మందలించాడు. దీంతో అదే రోజు సాయితేజ ఇంటినుంచి ద్విచక్రవాహంపై వెళ్లిపోయాడు. కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన తండ్రి భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా రఘునాథపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వెనకాల రైల్వే ట్రాక్ సమీపంలో చూడగా వేప చెట్టుకు ఉరివేసుకొని వేలాడుతున్న సాయితేజ మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టలేని స్థితిలో ఉండగా.. పక్కనే ఉన్న ద్విచక్రవాహనం సాయితేజదిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సాయితేజ ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసై పెద్ద మొత్తంలో డబ్బు పోగొట్టుకోవడం, విషయం తండ్రికి తెలిసి మందలించడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. తండ్రి పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు. కాగా. స్వగ్రామంలో నిర్వహించిన మృతుడి అంత్యక్రియల్లో డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పాల్గొని, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

కంఠమహేశ్వర స్వామి ఆలయంలో చోరీ

మేళ్లచెరువు : గుర్తుతెలియని వ్యక్తులు కంఠమహేశ్వర స్వామి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వెల్లటూరు పునరావాస కేంద్రం నందు నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 14న దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శుక్రవారం రాత్రి దుండగులు ఆలయం తలుపులు పగులగొట్టి హుండీ అపహరించారు. హుండీ తాళం పగులగొట్టి అందులోని సొత్తును చోరీ చేశారు. అనంతరం హుండీని మండలంలోని మంగళికుంటతండా రోడ్డు సమీపంలోని ఎస్ఎస్పీ కాలువలో పడేశారు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.